దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- వర్షా కాలంలో దోమల ఉధృతి
- పెరుగుతున్న జ్వర పీడితులు
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు

వేంపల్లె : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గ్రామాలు, పట్టణాల్లోని వీధులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో దుర్గంధం ప్రబలి దుర్గంధ వాతావరణంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు ప్రమాదకరం, చాలా రోగాలు దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. వర్షాల ప్రభావంతో చెత్త చెదారంతో పాటు వ్యర్థాలను రహదారులు, కూడళ్లు, డ్రైనేజీలలో పడవేయడంతో పారిశుద్ధ్యం లోపిస్తోంది. దీంతో దోమల ఉధృతి పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. రోజురోజుకు జ్వర పీడితులు పెరిగిపోతున్నారు. అపరిశుభ్రత కారణంగా ప్రజలు జ్వరాలు, అంటువ్యాధుల బారిన పడుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్య అధికారులు చెబుతున్నారు.

దోమకాటుతో వచ్చే వ్యాధులు, లక్షణాలు

మలేరియా : ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది.

లక్షణాలు : చలి, వణుకుతో జ్వరం రావడం. శరీర ఉష్ణోగ్రత పెరగడం. జ్వరం విడిచి విడిచి వస్తూ ఉంటుంది.

డెంగీ : పగటి సమయంలో కుట్టే ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరల్ జ్వరంగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.

లక్షణాలు : హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం. కదలలేని స్థితి. ఎముకలు కండరాలతో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతోపాటు చిగుళ్లు, ముక్కుల ద్వారా రక్తం వస్తుంది.

చికున్ గున్యా : ఏడీస్ ఈజిప్ట్ దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లు, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా ఉంటాడు.

లక్షణాలు : తలనొప్పి, వాంతులు, వికారంతోపాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు సరిగా నిలబడలేకపోవడం.


చెత్తా చెదారారంతో అపరిశుభ్రంగా ఉన్న వేంపల్లెలోని ఓ వీధి

ఫైలేరియా : క్యూలెక్స్ దోమ ద్వారా ఫైలేరియా(బోధకాలు) వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోధకాలు సోకుతుంది.

లక్షణాలు : తరచూ జ్వరం, చంకలు, గజ్జల్లో బిల్లలు కట్టడం, వెన్ను పాము దగ్గర నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు, కాళ్ల చేతులు, స్తనాలు, వర బీజం, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

మెదడు వాపు : క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో మెదడు వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కువగా 2 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది.

లక్షణాలు : ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం. విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోను కావడం, శరీరంలో ఏదో ఒక పక్షవాతానికి గురి కావడం, ఫిట్స్ రావడం జరుగుతుంది.

వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే ఉత్తమ మార్గం.

- రాత్రిలో పడుకునే ముందు దోమతెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేలా దుస్తులు వేసుకోవాలి.
- వేప నూనె, కొబ్బరి నూనెను 1:1 నిష్పత్తిలో తీసుకుని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి.
- దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉండదు.


వేంపల్లెలోని ఓ వీధిలో పూడికతో నిండిపోయిన డ్రైనేజీ కాలువ

- చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించి 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం కీటక నివారిణిగా పని చేస్తుంది.

నీటి నిల్వలతోనే ప్రమాదం



వారం వ్యవధిలో పరిసరాల్లో కానీ, ఇంట్లో ఉన్న నీటి నిల్వల్లో మలేరియా దోమలు వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది. ఎలాంటి పరిస్థితుల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. అలాగే ఇంట్లో ఉన్న కూలర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలు, చల్లదనం కోసం వాడే ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వాటి ద్వారా వచ్చిన నీటి నిల్వలలో డెంగీ దోమ వ్యాప్తి చెందుతుంది. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి, రెండవ విడతలో స్ప్రేయింగ్ ప్రక్రియ పూర్తి చేశాం. ప్రజలు జ్వరాల బారిన పడినప్పుడు వెంటనే నిర్లక్ష్యం వహించకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. అనంతరం వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలి.

– డాక్టర్ సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి, పులివెందుల

క్లుప్తంగా

కొండాపురం సీఐగా రాజ


బాధ్యతలు చేపట్టిన సీఐ రాజ

కొండాపురం : కొండాపురం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట సీఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కొండాపురంలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ మహమ్మద్ రఫీ మదనపల్లెకు బదిలీపై వెళ్లారన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

బాధ్యతల స్వీకరణ


అర్బన్ స్టేషన్ సీఐ నరేష్‌బాబు

జమ్మలమడుగు : జమ్మలమడుగు అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐగా పి.నరేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం ఆయన స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో కలిశారు. ఇక్కడ పని చేసిన సీఐ లింగప్ప బద్వేల్ అర్బన్ స్టేషన్‌కు బదిలీ కావడంతో.. ఎర్రగుంట్ల అర్బన్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ నరేష్‌బాబును జమ్మలమడుగుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు వ్యవస్థ ద్వారా నిఘా పెంచి అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.

24న బ్రాహ్మణ సమ్మేళనం


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

వేంపల్లె : కడపలో ఈ నెల 24వ తేదీన జరిగే బ్రాహ్మణ సమ్మేళనం ఆహ్వాన పత్రికను సోమవారం ఉదయం కడప బ్రాహ్మణ సమాఖ్య చైర్మన్ వి.శివరావు చేతుల మీదుగా ఆవిష్కరణ చేసినట్లు బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు నిర్వాహకులు పీవీఎస్వీ ప్రసాదరావు తెలిపారు. సోమవారం వేంపల్లెలో ఆయన తెలుపుతూ బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన కడపలోని శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో బ్రాహ్మణ సమ్మేళనం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. బ్రాహ్మణులు ఎదుర్కొనే సమస్యలపై విస్తృత చర్చ జరగనుందని, అన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతారన్నారు. అధిక సంఖ్యలో బ్రాహ్మణులు ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మానవత సంస్థ సాయం


జబ్బీర్‌ను పరామర్శిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు

వేంపల్లె : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ జబ్బీర్‌కు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయం చేసింది. ఇటీవల ఫోర్‌వీలర్ ఆటో పెట్టుకొని జీవనం సాగిస్తున్న డ్రైవర్ జబ్బీర్ ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు విరిగింది. సోమవారం వేంపల్లె మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.11 వేలను అందజేసింది. అనాథలతోపాటు ఇతర చనిపోయిన వారిని ఆటోలో తీసుకొని రావడానికి ఆటో డ్రైవర్లు ఎవరూ ముందుకు రాకపోయినా ఫోన్ చేసిన వెంటనే.. జబ్బీర్ ముందుకు వచ్చి తీసుకువెళ్లడంతోపాటు దహన సంస్కారాలు చేసే వారని మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఆ సంస్థ అధ్యక్షుడు యోగేశ్వర బాబు తెలిపారు. అలాంటి వ్యక్తిని ఆదుకొనేందుకు తమ వంతుగా మానవతా సంస్థ ద్వారా ఆర్థిక సహాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బీఎస్ రమణారెడ్డి, బొజ్జ రంగారెడ్డి, తిరుమల రెడ్డి, రీజినల్ చైర్మన్ బాలాజి, ఈసీ ఎమర్జెన్సీ బత్తల చలపతి, గురుప్రసాద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు


కోట వీధి వద్ద పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ ప్రహ్లాద

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. సోమవారం బస్టాండు, కోట వీధి, ఆర్ఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ ప్రహ్లాద తనిఖీ చేశారు. డ్రైనేజీ లో పూడికలు తీయడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు ఇంటితోపాటు పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగాలు దరి చేరకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారాన్ని వేయరాదన్నారు. ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి వ్యర్థాలుగా వేరు వేరుగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీ శ్రీనివాసులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చండి


ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న గాలి చంద్ర

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులపై ఏర్పడిన గుంతలను తక్షణం పూడ్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చిన్నచెప్పలి, కీర్తిపల్లె తదితర గ్రామాల్లోని రహదారులపై ఉన్న గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం మండలం చిన్నచెప్పలి, పొడదుర్తి, వెంకటాపురం, బయనపల్లె, వీఎన్ పల్లె మండలం పాయసంపల్లె, కీర్తిపల్లె తదితర గ్రామాల్లోని రహదారులు ఛిద్రమయ్యాయని, ఈ రహదారులపై మోకాటిలోతు గుంతలు పడ్డాయని, ఈ రహదారులపై ప్రజలు ఎలా ప్రయాణిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇసుక, మైన్స్ టిప్పర్లు తిరగడం వల్లనే రహదారులు ధ్వంసం అయ్యాయని, సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి


రైతులకు ట్యూబ్‌లు పంపిణీ చేస్తున్న మేరీ

జమ్మలమడుగు : హరిత గృహ వాయువును తగ్గించాలంటే అందుకు ఆరు తడి పంటలను సాగు చేయాలని ఏపీ సీఎన్ఎఫ్ ఏ మేరీ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి గ్రామంలో వరి పంట పండించే రైతులకు నీరు ఆరబెట్టడం, నీటిని మరల అందించడం, నీరు లోతుగా పరీక్షించటానికి నీటి వాటర్ ట్యూబ్‌లను అధికారులు రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట పండించే రైతులు నీరు ఎక్కువగా వాడకం వల్ల హరిత గృహ వాయువులు ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. కనుక రైతులు నీరు వినియోగం తగ్గించి 30 సెంటీమీటర్ల పొడవు ఉన్న ప్లాస్టిక్ పైపు తీసుకుని 15 సెంటీమీటర్ల వరకు 5ఎంఎం వ్యాసం కలిగిన రంధ్రాలతో 2 సెంటీ మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం రైతులకు నీటి వాటర్ ట్యూబ్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్యామ్ సుందరు, గురుమూర్తి, బాలనారాయణ, పుష్పలత, చంద్ర ఓబుళరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలి

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లే నాథుడే కరువయ్యారని మాజీ ఎంపీపీ గోగుల కొండయ్య ఆరోపించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో తాగునీటికి సంబంధించిన వాటర్ ట్యాంకులను శుభ్ర పరచడంతోపాటు తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను వేసేవారని, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ, కూటమి నేతలు కానీ ట్యాంకులను శుభ్రపరిచే వారిపై దృష్టి పెట్టకపోవడం దారుణమన్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడంతో ప్రజలు రోగాలబారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. వేంపల్లెలో ఎక్కడ చూసినా కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. ప్రజల కష్టాల పట్ల కూటమి నాయకులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కూటమి నేతలు వారి ఆర్థిక స్వలాభం కోసం పని చేస్తున్నారే కానీ, వేంపల్లె పంచాయతీలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వేంపల్లెలో నెలకొన్న ప్రజల సమస్యలతోపాటు వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను నీటిలో కలపాలని కోరారు.

రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


శ్రీరామ్ నగర్‌లో డ్రైనేజీ కాలువను శుభ్రం చేయిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

వేంపల్లె : వాతావరణ మార్పుల వల్ల రోగాలు సోకే ప్రమాదం ఉందని, ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ ఖాజా మొహిద్దీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీరాంనగర్ నగర్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ ఖాజా మొహిద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి డాక్టర్ వెంకటరెడ్డిలు అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. వాటిని పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. దోమల నివారణకు సైఫెనోత్రిన్ మందును పిచికారి చేయించారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు రోగాలపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వారు ఆశా కార్యకర్తలు చేపట్టే లార్వా సర్వే, ఫీవర్ సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సుభాషిణి, నిహారిక, సునీత, సుశాంతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆవు వేదన.. అరణ్య రోదన


కాలికి గాయమైన ఆవు

పులివెందుల పట్టణంలో ఎన్నో ఆవులు సంచరిస్తూ.. నరకయాతన అనుభవిస్తున్నాయి. వాటి సంరక్షకులు అవేమీ పట్టనట్లుగా రోడ్లపైకి వదలడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం పట్టణంలో ఓ గోమాత కాలికి గాయమై రక్తం కారుతూ అవస్థలు పడుతోంది. ఆ ఆవు తన దూడను వెంట తిప్పుకొంటూ నానా తిప్పలు పడుతూ కడుపు నింపుకొంటోంది. వాటి వేదన అరణ్య రోదనగా మారింది. దెబ్బ తగిలిన ఆవుకు యజమానులు వైద్యం చేయించి సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

– పులివెందుల టౌన్

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం


గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చింతకొమ్మదిన్నె : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతకొమ్మదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు పిలుపునిచ్చారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నార్కోటిక్ సెల్ విభాగం, ఈగల్ సిబ్బంది ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, ఇతర డ్రగ్స్‌ను అరికట్టడానికి 'ఈగల్' (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) అనే టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారని తెలియపరుస్తూ ఎన్‌డీపీఎస్ చట్టాలు, వాటిలోని కఠినమైన శిక్షల గురించి వివరించారు. డ్రగ్స్ లేదా గంజాయి అమ్మకాల గురించి ఎక్కడైనా సమాచారం తెలిస్తే, వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు డ్రగ్స్ నివారణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ టీంకు చెందిన అయ్యుబ్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు


ముద్దనూరు ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

పులివెందుల రూరల్ : పులివెందుల నుంచి కర్నూలుకు వెళ్లే ఆర్టీసీ బస్సు మొరాయించింది. సోమవారం పులివెందుల ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ04జెడ్ 0184 అనే నంబర్ గల ఆర్టీసీ బస్సు పులివెందుల నుంచి కర్నూలుకు బయలుదేరింది. ముద్దనూరు ఘాట్‌లోకి రాగానే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాలకు కూడా ఇంత పాత బస్సును వేస్తారా అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కండిషన్‌లో ఉండే ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఆడబిడ్డలను ఆటబొమ్మలుగా చూస్తోందని, అందుకే వారిపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగమైన అధికార పార్టీ ఎమ్మెల్యేలే మహిళలపై వేధింపులకు పాల్పడుతుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా, ఆముదాల వలసలో కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపల్‌పై ఎమ్మెల్యే కూన రవికుమార్ లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మరో ఎమ్మెల్యే ఆదిమూలం సొంత పార్టీ కార్యకర్తనే వేధిస్తే ఆమె ఆత్మహత్య ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. వీటిపై ముఖ్యమంత్రిగానీ, హోంమంత్రిగానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ సమావేశంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి, కో ఆప్షన్ సభ్యురాలు బి. మరియలు, మహిళా నేతలు సుశీలమ్మ, భాగ్యమ్మ, శ్రీదేవి, మల్లీశ్వరి, పద్మ పాల్గొన్నారు.

ఫసల్ బీమా గడువు పెంపు

కమలాపురం : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం గడువును ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఏఓ సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు తాము సాగు చేసిన పంటలకు ఈ నెల ఆఖరు వరకు క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఎకరాకు వరి పంటకు రూ.84, కంది రూ.36, మినుము, జొన్న పంటలకు రూ.38, ఉల్లికి రూ.90 చొప్పున ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో మంగళవారం నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈనెల 19, 20వ తేదీల్లో నగరిగుట్టలోని జిల్లా పరిషత్ హైస్కూలు, 21, 22వ తేదీలలో జిల్లా పరిషత్ హైస్కూలు(మెయిన్ రోడ్డు), రమణప్ప సత్రం స్కూలు (అంకాలమ్మపేట), 23వ తేదీన జిల్లా పరిషత్ బాలికల హైస్కూలు, ఎంజీపీఏపీబీసీ డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. కావున ఈ కేంద్రాలలో ఆధార్ సంబంధిత సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

ముద్దనూరు : మండల పరిధిలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ దస్తగిర సోమవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పర్వదినం నాడు ఏర్పాటు చేసే విగ్రహం వివరాలు, నిమజ్జనం, తదితర వివరాలతో అనుమతి తీసుకోవాలని ఆయన తెలిపారు.

అన్నదాత సుఖీభవ అందని రైతులకు అవకాశం

ముద్దనూరు : అర్హత వుండి అన్నదాత సుఖీభవ పథకం వర్తించని రైతులు ఈ నెల 20వ తేదీ నాటికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ వ్యవసాయ శాఖ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ సూచించారు.

ఎరువులు సకాలంలో అందించాలి

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైయస్ఆర్ కడప జిల్లాకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు కావలసిన ఎరువులు సకాలంలో అందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడుకు ఆయన రైతులతో కలిసి వినతి పత్రం అందించారు. రైతు సేవ కేంద్రాల ద్వారా ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు ఎరువుల దుకాణదారుల వద్ద ఎమ్మార్పీ ధరలకు మించి అధిక మొత్తంలో వెచ్చించి ఎరువులు కొనుగోలు చేసే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు ఖరీఫ్ సీజన్‌లో మే నెల నుంచి సెప్టెంబర్ నెల వరకు 5 నెలల పాటు యూరియా 50,000 మెట్రిక్ టన్నులు, డిఏపి 16,500 మెట్రిక్ టన్నులు, యంఒపి 10,500 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 44,000 మెట్రిక్ టన్నులు.... మొత్తంగా 1,21,000 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 30,000 మెట్రిక్ టన్నులు కూడా అందుబాటులో లేవని చెప్పారు. డీఆర్ఓను కలిసిన వారిలో రైతు నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బి. సుబ్బరాయుడు యాదవ్, ఎస్. చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ... గంటల తరబడి వేచి చూసి...

రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం అది కొన్ని బస్సులకే అని తెలియడంతో మహిళా ప్రయాణికులు బస్సులకోసం గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షణ చేయవలసి వస్తోంది. ఉచిత బస్సు దేవుడికెరుక కానీ ఉన్న బస్సులు వేళకు రాక మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ దృశ్యాలు సోమవారం వైఎస్సార్ కడప జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండ్‌లో కనిపించాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప









ఆర్థిక సాయం


మోహన్‌రెడ్డికి ఆర్థిక సాయం చేస్తున్న కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ సభ్యులు

కడప కార్పొరేషన్: జిల్లాలోని పెండ్లిమర్రి మండలం యార్లపాడుగ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డికి కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ తరుపున రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం కువైట్ రెడ్డీస్ సంఘం అధ్యక్షులు నాయని మహేశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు మన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డి, వీపీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు అరవ సుబ్బారెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డిలు ఆయన్ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, వై. రవిచంద్రారెడ్డి, పి . రెహమాన్ ఖాన్, సుండుపల్లె జడ్పీటీసీ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.